సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 18-12-2024
సంపుటి: 20 సంచిక: 225
పేజీలు: 4 వెల: రూ.1

## రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

(సత్యంన్యూస్, టెక్కలి)

కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయరాలు సంపతిరావు త్రివేణి(30) మృతి చెందారు. స్థానికులు తెలిపిన మేరకు కొత్తపేట నుంచి ద్విచక్ర వాహనంలో టెక్కలి మండలం సన్యాసిపేటలోని ప్రభుత్వ ఎలిమెంట్రీ పాఠశాలకు వెలుతున్న క్రమంలో పాకివలస వద్ద ఈ ప్రమాదం జరిగింది. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెలుతున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి ఫల్టీకొట్టింది. ఆ క్రమంలో టెక్కలి వైపు ద్విచక్ర వాహనంపై వెలుతున్న త్రివేణిపై కారు పడింది. రోడ్డుకు తల బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. త్రివేణి స్వగ్రామం ఆమదాలవలస మండలం తిమ్మాపురం. భర్త ఇండస్ బ్యాంకులో పని చేస్తున్నారు. వీరిది ప్రేమ వివాహం. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం చిత్తూరు నుంచి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ చేసుకొని వచ్చారు. ప్రతి రోజు తిమ్మాపురం నుంచి క్యాబ్‌లో కొత్తపేట వరకు వచ్చి అక్కడ ఉంచిన ద్విచక్ర వాహనంలో సన్యాసిపేటకు రాకపోకలు చేస్తున్నారు. ఆమె మృతి సమాచారం తెలుసుకున్న పలువురు టెక్కలికి చెందిన ఉపాధ్యాయులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి చేశారు.



# ‘ష’... ఆయన వాటా ఎంతని అడక్కండి!

- ప్రజాప్రతినిధుల పేరు చెప్పి నామినేషన్ వర్క్‌లతో దోపిడీ
- పనులన్నీ ఆ ఏఈ బినామీకే
- బదిలీపై వెళ్లిపోతూ మెజర్మెంట్లు, బిల్లులు రెడీ చేసిన అధికారి
- మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు సుదీర్ఘకాలంగా పాలకవర్గం లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న అధికారులదే ఇష్టారాజ్యమైపోయింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏం జరుగుతుందో అటు కలెక్టర్‌కుగాని, ఇటు కమిషనర్లుగా పని చేస్తున్నవారికి గాని ఏమాత్రం తెలీదు. ఇక్కడ ఇంజినీర్లుగా పని చేస్తున్నవారే చక్రం తిప్పుతుండగా, కమిషనర్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఎవరైనా వార్డుల్లో చెత్తలు ఎత్తిస్తే సరిపోతుందన్న భావనతో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఏడేళ్ల పాటు ఇక్కడ ఏఈగా పని చేసి, ఒక్కడే కార్పొరేషన్ కార్యాలయంలో చక్రం తిప్పి, రెండు నెలల క్రితం విశాఖపట్నం బదిలీపై వెళ్లిపోయిన ఏఈ సంతోష్ తన బినామీలకే కార్పొరేషన్‌లో పనులన్నీ కట్టబెట్టి వాటి బిల్లులు పూర్తి చేసి తన వాటాను పట్టుకొని విశాఖపట్నం వెళ్లిపోయారు. స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోని పార్కులో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్రమంత్రి హోదాలో రామ్మోహన్ నాయుడు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్కును స్థానికులు ఉపయోగించుకునే విధంగా మారుస్తామని రొటీన్‌గా మీడియాకు ఒక మాట చెప్పారు. కేంద్ర మంత్రి చెప్పారు కాబట్టి, పాత హౌసింగ్‌బోర్డు ప్రజలకు అవసరం కాబట్టి ఈ పార్కును సుందరీకరించడంలో ఎవరికీ ఎటువంటి అభ్యంతరాలూ లేవు. కాకపోతే కేంద్రమంత్రి చెప్పారని అర్జంటుగా రూ.10 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించేశారు

- మిగతా 4లో






• ఎడిటోరియల్

## పని గంటలు పెంచితే పేదరికం పోతుందా?

'వారానికి డెబ్భై పని గంటలు' దేశానికి అవసరమని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి మరోసారి నొక్కి వక్కాణించారు. అన్ని పని గంటలు లేకపోవడం వల్లనే దేశం ఇలా దరిద్రంలో కొట్టుమిట్టాడుతోందని కూడా సెలవిచ్చారు ఆ సాఫ్ట్‌వేర్ టెకీ వణిక్ ప్రముఖుడు. అన్ని పని గంటలు లేకుంటే దేశం ఎలా పేదరికాన్ని జయిస్తుందని కూడా ఆయన అడిగారు. ఆయన వేతనాల గురించి మాట్లాడకుండా కేవలం పని గంటల గురించి, ఉత్పాదకత గురించి మాత్రమే మాట్లాడటంలోనే అసలు వ్యాపార కిటుకు వుంది. ఆయన దృష్టిలో పని చేయడమంటే సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పట్టణ/నగర పరిశ్రమల్లో పని చేయడమే కావచ్చు. ఇప్పుడొచ్చే జీతానికే నగరాలలో వున్న కంపెనీలు, పరిశ్రమల్లోని ఉద్యోగులు, శ్రామికులు ఎక్కువ గంటలు పని చేయాలని ఆయన ఆశిస్తుండవచ్చు. దానివల్ల పేదరికం ఎలా తగ్గుతుంది? తక్కువ వేతనమిచ్చి ఎక్కువ పని చేయించుకోవడం వల్ల కలిగే లాభాలు ఆయా పెట్టుబడిదారులకే పోతుంది కదా! ఇది పేదలకే కాదు, సామాన్య జనానికి కూడా తీవ్రమైన నష్టం. మన దేశంలో పని చేయగలిగిన, చేద్దామనుకున్న, చేస్తామనే వారందరికీ పని దొరకడమే గగనం. ఈ ఎక్కువ గంటల పని విధానం వల్ల పని పూర్తిగా దొరకక పేదలు మరింత పేదరికంలోకే వెళతారు. పేదలకు నిజంగా మేలు జరిగి, పేదరికం నుంచి బైటపడాలంటే వారికి సుస్థిర ఉపాధి, న్యాయమైన వేతనం దొరకాలి కానీ ఎక్కువ గంటలు పని చేయడం కాదు. వారి పేదరికానికి ప్రధాన సవాలు అధిక ధరలు. మూర్తి సాబ్, మీకు చేతనైతే ఈ విషయంలో ప్రభుత్వాలతో పోరాడండి. మన మూర్తిగారికి పేదరికం గురించి, దాని కారణాల గురించి, పేదరిక నిర్మూలనా వ్యూహాల గురించి కనీసమైన అవగాహన లేదని అర్థమవుతుంది. పేదరికానికి మూల కారణం ప్రకృతి వనరుల, ఆదాయ వనరుల అసమ పంపిణి. వ్యవసాయ దేశమైన భారత్‌లో అత్యధిక శాతం భూమి తక్కువ శాతం వున్న పైకులాల వారి చేతిలో వున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పేదలు వారానికి ఆరు రోజుల చొప్పున డెబ్భై గంటలు (అంటే రోజుకి 12 గంటలు) ఎక్కడ పనిచేయాలి? రోజుకి పన్నెండు గంటలు చొప్పున పని చేసినా వారికి అధిక కూలీ వస్తుందా? లేకపోతే గ్రామీణ పేదలు అదే కూలీకి ఎక్కువ పని చేయాలని మూర్తి గారు ఆశిస్తున్నారా? అసలు పని అంటూ వుంటే గ్రామీణ పేదలు పట్టణాలకు వలస ఎందుకు పోతారు? హలో మూర్తిగారూ! ఉపాధి కోసం, పిల్లలకు నాణ్యమైన విద్య కోసం, కుటుంబానికి ఆరోగ్య వసతుల కోసం పట్టణాలకు వలస వచ్చిన పేదలు రోజుకి కేవలం ఆరేడు గంటలు మాత్రమే పని చేస్తున్నారని అనుకుంటున్నారా? మాల్స్‌లో ఎన్ని గంటలు డ్యూటీ వుంటుందో మీకు తెలుసా? పెట్రోల్ పంపుల్లో, హోటళ్లల్లో, థియేటర్లలో పని చేసేవాళ్లు ఎన్ని గంటలు పని చేస్తారో, వారికొచ్చేదెంతో ఎరుకేనా మీకు? మీకేమీ తెలియదని చెప్పటానికి కేవలం ఉదాహరణ కోసమే ఈ రెండు ప్రశ్నలు. ఈ దేశ వర్క్ ఫోర్స్ ఎన్నో వందల వేల వృత్తుల్లో, ఎన్నో లెక్క లేనన్ని గంటలు పని చేస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తూనే వున్నది. ఇప్పుడు టెకీలు కూడా రోజుకి పది నుంచి పన్నెండు గంటల వరకు పని చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం అంటే అది అనంతం ఇంక! ఇంత కంటే ఎక్కువ చేస్తే మాత్రం పనిలో నాణ్యత వుంటుందా? మూర్తిగారూ మీకు ఎవరైనా బలవంతంగా అయినా చార్లీ చాప్లిన్ సినిమా 'మోడర్న్ టైమ్స్' చూపిస్తే బాగుండు! అందులో మీబోటి కేరక్టర్ ఒకటి వుంటుందిలెండి ఆ సినిమాలో. మీరు తప్పక చూడాల్సిన సినిమా అది. రోజుకి వుండేదే ఇరవై నాలుగ్గంటలు. అందులో పన్నెండు గంటలు పని చేసి, ఏడు గంటలు నిద్రపోతే ఇంక మిగిలిన కొద్ది గంటలు కుటుంబంతో గడుపుతూ పిల్లల బాగోగులు, వారి చదువులు, ఆరోగ్యం వంటి ఇతర సమస్యలు అడ్రెస్ చేయడానికి పరిమితం చేయాలా? మూర్తిగారూ ఈ దేశపు వర్క్ ఫోర్స్ అంతా మీ వంటి పెట్టుబడి బాబుల కోసం పుట్టిందనుకుంటున్నారు కామోసు! పన్నెండు గంటలు పని చేసొచ్చిన స్త్రీలు కనీసం తమ ఆరోగ్యం గురించైనా పట్టించుకోగలుగుతారా? మీకు అంటే మీ బంగళాల్లో గిన్నెలు తోమేవారి దగ్గర నుంచి తోటమాలుల వరకు నౌకర్లు, చాకర్లు వుంటారు. మామూలు జనంకి ఒక్క పూట ఇంటి పని తప్పడమే మహా విలాసం మూర్తి బాబూ! ఈ దేశ జాతీయ సంపదలో 42.5 శాతం కేవలం ఒక్క శాతం ధనిక ప్రజల చేతిలో వుండగా దేశ జనాభాలో 50 శాతం మంది దగ్గర కేవలం 2.8శాతం సంపద వుంది మూర్తిగారూ! పైన వున్న 1 శాతం మంది సంపద గత సంవత్సరంలో 46 శాతం పెరిగింది. పేదరికానికి ముఖ్య కారణం మీ వారానికి డెబ్భై గంటలు అమలు చేయక పోవడమా లేక అసమసంపద, వనరుల పంపిణీనా? పేదరికం పోవాలని నిజాయితీగా సంకల్పిస్తే జనాల్ని ఆడిపోసుకోవడం కాకుండా ప్రభుత్వాలతో కొట్లాడాలని, రాజకీయ/ఆర్థిక విధానాల్ని ప్రశ్నించాలని ఆయనకు ఎవరైనా చెబితే బాగుండును కదా!



ఎలాగైనా లా చదవాలన్న ఆకాంక్ష గుజరాత్ లోని ఆ బెంగాలీ బాబుది. అందుకోసం 24 ఏళ్ల నిరీక్షణ తప్పనిసరైంది. ఎందుకలా? గుజరాత్‌కు చెందిన 66 ఏళ్ల శశికుమార్ మొహతా స్టాక్ మార్కెట్ నిపుణుడు. అయినప్పటికీ లీగల్ ఇష్యూస్ విషయంలో ఇంకా తెలుసుకోవాలనే కుతూహలంతో న్యాయశాస్త్రం అభ్యసించాలనుకున్నాడు. అందుకోసం గుజరాత్ లోని దౌలత్ భాయ్ త్రివేది లా కళాశాలను సంప్రదించాడు. కానీ, శశికుమార్ మొహతాకు ఎల్‌ఎల్బీలో సీటు ఇవ్వడానికి ఆ కళాశాల నిరాకరించింది. గుజరాత్ యూనివర్సిటీ అఫిలియేటెడ్ డీటీ లా కళాశాలలో నిబంధనల ప్రకారం కనీసం 15 ఏళ్లు.. అంతకుముందు స్కూల్, కళాశాల చదువులు కల్గి ఉంటేనే.. ఎల్‌ఎల్బీలో సీటు లభిస్తుంది. 12 ఏళ్లపాటు స్కూల్, ఇంటర్ విద్యతో పాటు.. మూడేళ్ల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోవాలి. అప్పుడుగానీ గుజరాత్ యూనివర్సిటీ నిబంధనల ప్రకారం 15 ఏళ్లు పూర్తవుతుంది. కానీ, మొహతాకు అంతకుముందు 14 ఏళ్ల అకాడమిక్ విద్య మాత్రమే ఉంది. దాంతో కళాశాల యాజమాన్యం శశికుమార్ మొహతాకు సీటు ఇవ్వడానికి నిరాకరించింది.

# అడ్మిషన్ కోసం 24 ఏళ్ల నిరీక్షణ!!

### వ్యవస్థల్లో లోపాలను కళ్లకుగట్టే ఓ బెంగాలీ బాబు కథ!!

గుజరాత్‌లో స్థిరపడ్డ శశికుమార్ మొహతా కోల్‌కత్తా వాసి. కోల్ కత్తాలో 11 ఏళ్ల పాఠశాల విద్యను పూర్తి చేసి.. ఆ తర్వాత బీకామ్ డిగ్రీ చేశాడు. అప్పటికి అదే పశ్చిమబెంగాల్ లో ప్రామాణిక విద్యాభ్యాస తీరు. కానీ, 1979లో గుజరాత్ కు వలస వచ్చిన మొహతాకు.. ఆ ప్రామాణికత కాస్తా తన చదువులకు ప్రశ్నార్థకంగా మారింది. అదే దౌలత్ భాయ్ త్రివేది లా కళాశాలలో మొహతాకు సీటు దక్కకుండా చేసింది.

1970ల్లో పశ్చిమబెంగాల్ లో 11ఏళ్ల స్కూల్ విద్య, 3ఏళ్ల కళాశాల విద్య అనే అభ్యసన విధానముండగా.. గుజరాత్ లో 11 ప్లస్ 4 విధానంలో ఈ విద్య సాగేది. ఆ తర్వాత అది కాస్తా 12 ప్లస్ 3గా విద్యా విధానానికి మారింది.

అంతకుముందు 1987-88లో నవ్ గుజరాత్ కళాశాలలో కూడా ఓసారి తాను ప్రయత్నం చేయగా.. ఇవే పరిస్థితులు మొహతాకు ఆటంకంగా మారాయి.


దీంతో శశికుమార్ మొహతా సరిగ్గా 24 ఏళ్ల క్రితం.. 2000 సంవత్సరంలో అహ్మదాబాద్ సివిల్ కోర్ట్ మెట్లెక్కాడు. తన అర్హత పూర్తిగా చెల్లుబాటైనా ఎల్‌ఎల్బీ చదవడానికి కావల్సిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నా దౌలత్‌భాయ్ త్రివేది లా కళాశాల యాజమాన్యం తనకు అడ్మిషన్ నిరాకరించడంపై తన వాదనను వినిపించాడు. మొహతా వాదనతో కోర్ట్ అంగీకరించింది. చివరకు 24ఏళ్ల తర్వాత కోర్టు మొహతాకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

అదే సమయంలో కోర్టు తన తీర్పులో 12 ప్లస్ 3 పేరిట నిబంధనలు పెట్టి కచ్చితంగా 15 ఏళ్ల అకాడమిక్ చదువులుండాలనే నిబంధనపైనా అక్షింతలు వేసింది. అర్హత కల్గి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల పేరిట స్టీరియో టైప్ పద్ధతులు మానేయాలని.. ఒకరి ఆకాంక్షను, చదువుకోవాలనే ఆసక్తిని అడ్డుకోవడం సరికాదంటూ చివాట్లు పెట్టింది. కేవలం నిబంధనల పేరిట సాంకేతిక కారణాలు చూపిస్తూ అడ్మిషన్స్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది.


ఇప్పుడు మొహతా వచ్చే అకాడమిక్ ఈయర్ నుంచి తనకిష్టమైన లా కళాశాలలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించవచ్చు. అయితే, మొహతా సర్టిఫికెట్స్ అన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదో కావాలంటే వెరిఫై చేయొచ్చు. వాటిల్లో ఏమన్నా ఇబ్బందులుంటే తిరస్కరించవచ్చు.. కానీ, 15 ఏళ్ల అకాడమిక్ విద్య పేరిట అడ్మిషన్ నిరాకరించడం కుదరదని కోర్టు తేల్చి చెప్పేయడంతో.. 24 ఏళ్ల తర్వాత శశికుమార్ మొహతాకు న్యాయం లభించింది.

కోర్టులో మొహతా సాధించిన ఈ విజయం విద్యకు వయస్సు, కాలంతో పనిలేదనే విషయాన్ని నిరూపించింది. అదే సమయంలో, మన స్టీరియోటైప్ విద్యా విధానానికి ఓ చెంపపెట్టులా తీర్పునిచ్చింది అహ్మదాబాద్ సివిల్ కోర్ట్. మరోవైపు, కళాశాలలో జరిగిన అన్యాయానికి కోర్ట్ మెట్లెక్కితే సత్వర న్యాయం కరువై ఇలా జీవితకాలం పోయాక తీర్పులు రావడం మన న్యాయ వ్యవస్థలో నెలకొన్న మరో విషాదం. మొత్తంగా ఇన్ని వ్యవస్థల్లో ఉన్న లోపాలను ఎత్తి చూపే ఓ కేస్ స్టడీగా మారింది.. శశికుమర్ మొహతా 24 ఏళ్ల న్యాయపోరాటం మార్గం చూపిందనడంలో సందేహం లేదు.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..




భానుప్రియ మిడిగుడ్లు ఎంత అందంగా వున్నాయి.! ఆ చీరతో బోల్డన్ని గోదావరి జ్ఞాపకాలు ..అది నాకు కావాలి."..!! ఇళయరాజా రీరికార్డింగ్ సితారకు జీవం పోసింది. శరత్ బాబు కోటు విప్పితే కనబడేచిరుగులచొక్కా సీన్‌కు రేవతి రాగంలో రాజా కంపోజ్ చేసిన వీణ బిట్ నభూతో నభ విష్యతి అన్నట్లు ఆ సీన్‌ను ఎలివేట్ చేసింది. ఇక చిలక వీణ మెట్లమీద పాకే షాట్ కుశుద్ధ ధన్యాసి రాగంలో చేసిన కంపోజింగ్ గురించిఎంత చెప్పినా తక్కువే. గౌరీ మనోహరి, ఉదయచంద్రి, రేవతీ, హిందోళం, శుద్ధ ధన్యాసీ, సింధుభైరవిలాంటి రాగాలు సితార సినిమాలో వినిపించడం..' సుగంధపుష్పాలు కలగలిసిన జ్ఞాపకాల.. పరిమళం' అంటారు వంశీ.! సినిమా ఫస్ట్ కాపీ వచ్చింది. ప్రివ్యూ షో వేశారు. లక్ష్మి ఫిలింస్ లింగమూర్తిగారు,అల్లు అరవింద్, కె.ఎస్‌రామారావు, కె.రాఘవేంద్రరావు, కమల్‌హాసన్ అమితాబచ్చన్, జయభాదురి లాంటి దిగ్గజాలొచ్చారు.. వీణ మీంచి చిలకెళ్ళినంత ఇంటిలిజెంట్‌గా లేదయ్యా మిగతా సినిమా" అంటూ నవ్వుతూ చెప్పారు కమల్ హాసన్. ఆయనకు ఆ సీన్ అంతగా నచ్చేసింది.వంశీని పిలిచి' నువ్వేమైని ఇన్స్‌స్టిట్యూట్ స్టూడెంటువా!.. అనడిగారు. కాదని తలూపాడు వంశీ.. బచ్చన్ గారు భానుప్రియను అమితంగా మెచ్చుకున్నారు. విశ్వనాథ్ గారైతే "నాకు చెప్పిన కథకన్నా బాగుంది సినిమా" అని అభినందించారు. అలా..అందరూ మెచ్చుకున్న ఆ సినిమా టాక్ ఆఫ్ ది టౌన్ అయింది..



# వంశీకి "ఏవో కొన్ని గుర్తొస్తున్నాయి!!"

సినిమా కెమెరామెన్ వచ్చి వంశీని అభినందించాడు. నేను పొరబడ్డాను..నేను మిడిగుడ్లు అన్న భానుప్రియ కళ్ళను జనం చాలా మెచ్చుకుంటున్నారు. ఫోన్ చేసి భానుప్రియకు సారీ చెప్పాలన్నాడు.. సితారని శ్రీదేవితో హిందీలో చేద్దామంటే,. తీసిందిమళ్ళీ తీస్తే ఏం బాగుం టుందంటూ వంశీదాటేశాడు. ఆ తర్వాత సితారను రష్యన్ భాషలోకి డబ్ అయింది. నేషనల్ అవార్డ్స్ ప్రకటించారు.సితారలోని 'వెన్నెల్లోగోదావరి పాటకు గాను ఎస్ జానకి ఉత్తమ గాయనిగా ఎంపికైంది. ఎడిటర్ అనిల్ మల్నాడ్‌కు బెస్ట్ ఎడిటర్ అవార్డొచ్చింది. బెస్ట్ రీజినల్ ఫిల్మ్‌గా సితారఎంపికైంది. నిర్మాతతోపాటు ఫ్లైట్లో ఢిల్లీవెళ్ళి అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ గారి చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు వంశీ. అలా సితార వంశీని దర్శకుడిగా నిలబెట్టింది.. అవార్డు కూడా తెచ్చిపెట్టింది. ఈ సారి మాత్రం "సితార" లాంటి సినిమా చేయకూడదు" కొత్తగా ఏదైనా చెయ్యాలన్న .. "అన్వేషణ"లో పడ్డారు వంశీ!!

- ఎ.రజాహుస్సేన్..!!

### వంశీ పొయెటిక్ షాట్స్‌కు కత్తెర..!!

సినిమా ఫస్టాఫ్‌లో వంశీ కూర్చిన పొయెటిక్ షాట్స్ బాగా లేవని, వాటిని తొలిగించమని బయ్యర్స్ చెప్పడంతో తీసేశారు. పాపం వంశీ విలవిల్లాడాడు. సినిమాకు ప్రాణం అవేనని మొత్తుకున్నాడు. అయినానిర్మాత మాత్రం బయ్యర్ చెప్పినట్లే చేయమనిచెప్పాడు.. ఇంకేముంది? నిర్మాత మాటలకు తిరుగేముంది? ఆ షాట్‌లకు కత్తెరపడింది. 1984, ఏప్రిల్ 12 న సితారసినిమారిలీజ్‌అయింది. అప్పుడే జంధ్యాలగారి ఆనందభైరవి కూడా రిలీజ్‌అయింది. ఫస్ట్ షో ఫస్ట్ టాక్.."సితార సినిమా వీక్‌గా వుంది. కామెడీ లేదు.. అవతల జంధ్యాలగారి సినిమాలో వీరభద్ర రావు, సుత్తివేలు కామెడీ అదరగొట్టేస్తోంది..ఆ సూపర్ హిట్ సినిమాతో పోలిస్తే సితార వీక్" అన్నారు. అయితే..లక్ష్మీ పబ్లిసిటీస్ ఈడ్పుగంటి లక్ష్మణరావుగారు మాత్రం వంశీ భుజంమీద చేయివేసి.. కంగారుపడకు..నువ్వుకష్టపడి చేసిన సినిమా నిన్ను దగా చెయ్యదు. ఇంతకు ముందు సీతాకోకచిలకను కూడా ఇలాగే అన్నారు..ఏమైందో..చూశావుగా" అంటూ ధైర్యంచెప్పారు.



### ఆ పాత చీర కావాలి!

నిర్మాత ఇంట్లో వున్నాడు వంశీ. ఫోన్ మోగుతుంటే ఎత్తాడు.. అవతల భానుప్రియ. 'నేను వంశీ ! చెప్పు'.. అన్నాడు. "ఏం లేదు..నేను జాతరలో కట్టుకున్న ఆ చీరను నాకిచ్చేస్తే సెంటిమెంటుగా దాచుకుంటాను.." అంది భానుప్రియ.. 'అది అరవై రూపాయల వాయిల్ చీర.... పైగా చాలాసార్లు ఉతకడంవల్ల రంగువెలిసిపోయింది కూడాను" అన్నాడు వంశీ..! "అయినా పర్లేదు..ఆ చీరతో బోల్డన్ని గోదావరి జ్ఞాపకాలు.. అది నాకు కావాలి." అంది భానుప్రియ కాస్తంతగట్టిగా..! మొత్తానికి ఆ. చీరను పార్శిల్ చేసి భానుప్రియకు పంపారు నిర్మాత..



## శ్రీకాకుళం జిల్లాకు గరిమెళ్ళ పేరు పెట్టాలి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకవి గరిమెళ్ళ సత్య నారాయణ పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టాలని గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు ప్రభుత్వాన్ని కోరారు. గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గరిమెళ్ళ సత్యనారాయణ 72వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన ప్రియాగ్రహారం లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాడాన రాజు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో శ్రీకాకుళం జిల్లాకు సుస్థిర స్థానం కల్పించిన గరిమెళ్ళ పేరు జిల్లాకు పెడితే ఆ మహనీయునికి ఘన నివాళి కాగలదన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో గరిమెళ్ళ పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టవలసిన ఆవశ్యకత మీద సాహితీవేత్తలు,వివిధ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేసి అభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఐ.గణపతిరావు మాట్లాడుతూ గరిమెళ్ళ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గరిమెళ్ళ పేరుతో ఉన్న కళాశాలలో పనిచేయడం మా అదృష్టమన్నారు. గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గరిమెళ్ళ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బ కోటేశ్వరరావు, అధ్యాపకులు నాగేంద్ర శర్మ, ధనుంజయ రావు, గోపి, గౌరీశంకర్, సాహితీవేత్తలు, అభిమానులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఈనెల 5నుంచి కోయంబత్తూరులో జరిగిన 62వ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్‌లో జిల్లాకు చెందిన వైద్యవిద్యార్థిని ఆర్.వి.రమ్య బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈమెను ప్రొఫెసర్లు రవి వెంకటాచలం, జి.పరుశురాం, జి.గౌరినాయుడు, కె.జాకబ్ తదితరులు అభినందించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## సిక్కోలు ముద్దుబిడ్డ రామ్మోహన్ నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన సందర్భంగా స్థానిక ఆదివారంపేట వద్ద అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ రామ్మోహన్ నాయుడు చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం శ్రీకాకుళం జిల్లాకే గర్వకారణం అని, వారి తండ్రి స్వర్గీయ ఎర్రంనాయుడు అడుగుజాడల్లో నడిచి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపి మంచి కీర్తిని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శీర రమణయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, చిట్టి మోహన్, చిట్టి సాయికిరణ్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు బుజ్జి, మూకళ్ల సింహాద్రినాయుడు, బగ్గు రామకృష్ణ, రెడ్డి శివన్నారాయన తదితరులు పాల్గొన్నారు.



## తీర ప్రాంత పరిరక్షణ ఒక సామాజిక బాధ్యత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భూమిపై వాతావరణం ఉష్ణోగ్రత నియంత్రించడంలోను, కొన్ని వాయువులను పీల్చుకోవడంలోనూ సముద్ర జలాలు చాలా ముఖ్యమైన ప్రభావం కలిగి ఉంటాయి. అలాంటి సముద్రతీర ప్రాంతాలు నూతన పోకడలతో కాలుష్యానికి గురవుతూ పెను ప్రమాదంగా మారుతున్నాయి. సోంపేట మండలం ఎర్రముక్కా నేతాజీ బీచ్‌లో ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే నిత్యం కార్తీక మాసం అనంతరం పిక్నిక్ సందడితో రద్దీగా ఉండే ఈ బీచ్ మందుబాబులకు అడ్డాగా మారి ఇటు మత్స్యకారులకు అటు పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నిత్యం మత్స్యకారులతో కలకలలాడే ఇసుక తిన్నెలు నేడు గాజు పెంకులు గీసుకొని ఎరుపెక్కుతున్నాయి. గతంలో స్థానికంగా ఉండే వ్యాయామ ఉపాధ్యాయుడు, తీరప్రాంత పరిరక్షణ కన్వీనర్ బి.బాబురావు మాస్టర్ పిలుపుతో ఇటు యువత అటు పెద్దలు కలిసి తీర ప్రాంత పరిరక్షణ కోసం తీర ప్రాంతంలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన సంగతి విధితమే. కానీ నేడు యువత మద్యం మత్తులో తేలియాడుతూ మత్స్యకారులు వలలు దాచుకునే షెడ్డులను అడ్డా మార్చుకొని మందు సీసాలు పగలగొట్టి విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి తరుణంలో మెరైన్ పోలీసులు, స్థానికంగా ఉండే యువత చొరవ చూపి తీరప్రాంతాలను సంరక్షించాలని స్థానిక ప్రజలు కోరుచున్నాము. ప్రస్తుతం నేతాజీ బీచ్ అన్ని రకాలుగా అభివృద్ధి చెంది ఉందని ఎర్రముక్కాం తీరప్రాంత పరిరక్షణ కన్వీనర్ బి బాబురావు తెలిపారు.

## సఫాయి కార్మికులకు డిస్లడ్జింగ్ వాహనాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు ఇటీవల అందజేసిన డిస్లడ్జింగ్ (సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు) వాహనాలను జాతీయ సఫాయి కార్మికుల కమిషన్ సభ్యులు పి.పి.వావా బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, వావా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి, లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం వారికి ప్రత్యేక కిట్లను అందజేశారు. ప్రతి వాహనం రూ. 31,67,326 విలువైనదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ పేర్కొన్నారు. ఈ వాహనాలను రెండు గ్రూపులకు అందజేశామని, సాంప్రదాయక వృత్తి నిర్వాహకుల జీవన ప్రమాణాలను, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో అవి కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు.



TO LET
2BHK HOUSE
FULLY FURNISHED
LBS COLONY, SRIKAKULAM
94401 95559, 99881 95559

FOR SALE
3BHK FLAT 2025 SFT
WITH CUPBOARDS,
INDIVIDUAL PRESSURE
MOTOR ,
4 WASHROOMS
KATTA'S SURYA PRIDE
LBS COLONY SRIKAKULAM.
94401 95559, 99881 95559

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల అటానమస్‌లో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన, వాణిజ్య శాస్త్రము, అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులతో వినియోగదారుల హక్కులు పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు చేయించారు. తదుపరి కళాశాలలో విద్యార్థినిలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థినిలకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ వినియోగదారులమే కాబట్టి వినియోగదారుల హక్కుల పట్ల గ్రామాల్లో అవగాహన తక్కువగా ఉంటుంది కాబట్టి విద్యార్థులంతా తమ గ్రామాలకు వెళ్ళినప్పుడు వినియోగదారుల హక్కులు గుర్చి ప్రజలలో చైతన్యం కల్పించాలన్నారు. కామర్స్ హెచ్‌ఓడి అధ్యాపకులు ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ నేటి డిజిటల్ యోగంలో వినియోగదారులు ప్రకటనల ద్వారా చాలా మోసపోతున్నారని, కాబట్టి వస్తుసేవలు కొనుగోలు చేసే వినియోగదారులందరూ కూడా చట్టాల పట్ల పరిజ్ఞానాన్ని పొంది మోసాల నుండి రక్షణ పొందవచ్చున్నారు. వినియోగదారులకు జరిగిన అన్యాయాన్ని నుండి రక్షణ పొందడానికి చట్టాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. అలాగే అర్థశాస్త్ర అధ్యాపకులు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజు ఎంతో మంది వినియోగదారులు వస్తు సేవలు కొనుగోలులో మోసపోతున్నారని వారికి వినియోగదారీ చట్టం కల్పించే రక్షణలను తెలపడం ద్వారా వారిలో అభద్రతా భావాన్ని తొలిగించవచ్చున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్‌రావు వైస్ ప్రిన్సిపల్ పైడి శంకర్‌నారాయణ, ఐక్య సి కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకాడమిక్ కో–ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు కామర్స్ అధ్యాపకులు లలితాభాయ్, సంతోషి పట్నాయక్, యు.పావని, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.





కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజు వేడుకలు స్థానిక శాంతా అనురాగ నిలయంలో నగర బీసీ సెల్ అధ్యక్షులు, 26వ డివిజన్ ఇన్‌చార్జ్ ఉంగటి రమణమూర్తి, 34వ డివిజన్ ఇన్‌చార్జ్ ప్రియా చిట్టిబాబు, 27వ డివిజన్ ఇన్‌ఛార్జ్ గంగు పెద్ద రమణ, గొలివి ధనుంజయరావు (దాము) ఖాజీపేట, మంగువారితోట నాయకులు దాస్యం నానిలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యంలు చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## అగ్నిప్రమాదంలో ధాన్యం దగ్ధం

(సత్యంన్యూస్ కొత్తూరు)

మండలంలోని జగన్నాథపేట సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 30 బస్తాల ధాన్యం దగ్ధం అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూరు మండలం జగన్నాథపేట సమీపంలో పంట పొలాల్లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 30 బస్తాల ధాన్యం దగ్ధమైంది. బలద గ్రామానికి చెందిన పూర్ణచంద్ర పాణిగ్రాహి రైతు పొలంలో ఈ ధాన్యం బస్తాలను ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు పొలానికి నిప్పు పెట్టడంతో అగ్ని మంటలు ఎగసిపడి ధాన్యం బస్తాలు కాలిపోయాయి. రైతు ఫిర్యాదు మేరకు కొత్తూరు ఆర్ఎస్ఐ, గ్రామ పెద్దలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



# విలువలతో కూడిన విద్యను అందించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విలువలతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాలను తరిమికొడుద్దాం అని ప్రత్యేకంగా నిర్వహించిన సంకల్పం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డీఐజీ జ్యోతి ప్రజ్వలనచేసి, మాదకద్రవ్యాల రహిత సమాజానికి దారి చూపిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యూట్యూబ్ చానెల్ రవణ లఘు చిత్రం, జోష్ శివ మాస్టర్ ఆద్వర్యంలో యువత డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు గురించి ఫ్లాష్ మాబ్ డ్యాన్స్ చేశారు. అనంతరం డీఈజీ మాట్లాడుతూ విద్యార్థి దశలోని సత్ప్రవర్తనతో నడుచుకొని ఉన్నతవిద్యను అభ్యసించి, నైతిక విలువలు పెంపొందించుకొని నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లిదండ్రులు కలలు సాకారాన్ని చేసే విధంగా మంచి నడవడితో నడుచుకొని ఆ దిశగా జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని పేర్కొన్నారు. నవ సమాజ స్థాపనలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమని అట్టి విద్యార్థులు నైపుణ్యత భావాన్ని పెంపొందించుకొవాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు అరెస్టుల కంటే అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం అన్నది ఒకరి సమస్య కాదని, సమస్య ప్రతీ ఒక్కరదని, సమాజానిదని, వాటిని నియంత్రించే బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందన్నారు. ద్రవ్యాలను వినియోగిస్తున్న, కలిగివున్న, విక్రయిస్తున్న వారి సమాచారాన్ని పోలీసువారికి అందించాలన్నారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండే విధంగా ప్రతీ ఒక్కరూ చేయిచేయి కలిపి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ కెవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం తీర్చిదిద్దడంలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. కావున ప్రతి ఒక్కరు డ్రగ్స్ రహిత సమాజం తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ సంబంధించిన సమాచారాన్ని 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయలని, స్థానికంగా కళాశాల పరిసరాలలో ఎటువంటి గంజాయి విక్రయాలు జరిగినట్లయితే కళాశాలలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ డ్రాప్ బాక్సులు ద్వారా అట్టి సమాచారం తెలియజేసి జిల్లా పోలీస్ యంత్రాంగానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు, యువత నాశనమవుతున్నారన్నారు. సమాజానికి హాని కలిగించే మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. జిల్లా పోలీసుశాఖ యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు మంచి ఉద్దేశ్యంతో 'సంకల్పం' కార్యక్రమంను చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఈగల్ టాస్క్ ఫోర్స్, డ్రగ్స్ వద్దు బ్రో మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాలు తెలిపే ప్రత్యేక గోడ పత్రికలను డీఐజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల సమాచారాన్ని తెలిపేందుకు ప్రతి కళాశాలలో ఏర్పాటు చేస్తున్న డ్రాప్‌బాక్సులను కళాశాల యాజమాన్యానికి డిఐజి, ఎస్పీ అందజేశారు. కళాశాల యాజమాన్యం ప్రతినిధులు కు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రమణ, శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజ్ జాయింట్ సెక్రటరీ దుర్గా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ దుర్గా ప్రసాద్ రాజు, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, డిఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, ఇమ్మాన్యువల్ రాజు, ఈశ్వరరావు, పైడపునాయడు, ఇతర అధికారులు ప్రతినిధులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తొలగించిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను తిరిగి వైద్యారోగ్య శాఖలోకి తీసుకోవాలని, తెలంగాణ హైకోర్టు తీర్పును అనుసరించి ఏపీలో జీవో 1207 ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నల్లి రవికుమార్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ పద్ధతుల పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను కోర్టు తీర్పు ద్వారా ప్రభుత్వం తొలగించిందని తొలగించిన వారందరినీ ప్రభుత్వం తక్షణమే వీధుల్లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా అంకితభావంతో విధినిర్వహిస్తూ కోవిడ్ వంటి మహమ్మరి సంభవించినప్పుడు ప్రాణాలకు సైతం తెగించి పోరాడుతూ అంకితభావ ఉద్యోగాన్ని నిర్వహించి తొలగించబడిన వీరిని మానవతా దృక్పథంతో కాంటాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలని తిరిగి వారిని విధుల్లో కొనసాగించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకులు తెలుగునాడు వైద్య ఆరోగ్య సంఘానికి వినతి చేస్తు మమ్మల్ని విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలని ఆరోగ్య కార్యకర్తలు అందరూ వేడుకున్న విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వారికి మంచి భవిష్యత్తుని ఇవ్వాలని కోరడమైనదనీ ఇందుమూలంగా డా.రవికుమార్ అన్నారు















# మిల్లర్ల ఐక్యతను చాటుదాం

- ✔ భేదాభిప్రాయాలు లేకుండా పనిచేస్తా
- ✔ సంఘం నూతన అధ్యక్షుడు బోయిన రమేష్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మిల్లర్ల ఐక్యతను చాటి రైస్ ఇండస్ట్రీని మరింత ముందుకు తీసుకువెళదామని సంఘం నూతన అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మిల్లర్ల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘానికి అధ్యక్షులుగా తన పేరును సూచించిన రాష్ట్ర, కేంద్ర మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. మిల్లర్లలో అభిప్రాయ భేదాలు లేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానని వెల్లడించారు. జిల్లాలో రైస్ ఇండస్ట్రీ అనేక మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. రైతులు, రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న కార్మికులతో పాటు మిల్లర్లు బాగుండాలన్నారు. మిల్లర్ల సహకారంతో సంఘాన్ని గౌరవప్రదమైన స్థితిలో నిలబెట్టడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సంఘ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడం కత్తిమీద సాములాంటిదని, అందరి మన్ననలు పొందేలా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. 2016-19 మధ్య అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినా ఆశించిన మేర మిల్లర్లకు న్యాయం చేయలేకపోయానన్నారు. అప్పటి ప్రభుత్వం విధానం కారణంగా బిల్లులు చెల్లింపులో అందరు మిల్లర్లు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులు రావని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారని తెలిపారు. ఆ ధైర్యంతోనే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. గతంలో ఎదురైన అనుభవాన్ని మంత్రి అచ్చెన్నాయుడుకి వివరించి పూర్తి సహకారం అందించాలని కోరినట్టు తెలిపారు. పూర్వ అధ్యక్షులు వాసు హయాంలో జిల్లాలో మిల్లర్లకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. సంఘానికి అన్ని రకాలుగా న్యాయం చేశారని తెలిపారు. గత పాలక వర్గం ప్రతినిధులు అనుభవాలను, సహకారాన్ని, సూచనలను నూతన కార్యవర్గానికి అందించాలని కోరారు. రైస్ మాఫియా ఆగడాలు వెలుగుచూడడంతో కూటమి ప్రభుత్వం మిల్లర్లను భూతద్దంలో చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నాళ్ల పాటు మిల్లర్లు స్వార్థం వీడి ప్రభుత్వానికి, రైతులకు మేలు జరిగేలా వ్యవహరించాలని కోరారు. మిల్లర్లు కొంత సంయమనం పాటించాల్సిన సమయమని గుర్తించుకోవాలని, రైతులకు ఇబ్బంది కలిగిలా వ్యవహరించవద్దని మిల్లర్లకు సూచించారు. పూర్వ అధ్యక్షులు వాసు మాట్లాడుతూ తనకు సంపూర్ణ సహకారం అందించిన మిల్లర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కేవీ గోపాలకృష్ణ కార్యదర్శ నివేదకను సభ ముందు ఉంచి గత ఐదేళ్లలో నిర్వహించిన కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలను వివరించారు. ఈ సందర్భంగా బోయిన రమేష్‌కు మిల్లర్లు గజమాలతో సత్కరించి దుశ్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం శాశ్వత అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, గొండు కృష్ణమూర్తి, చిన్నాల కూర్మినాయుడు, సుసరాం భూషణ్, తంగుడు జోగారావు, తంగుడు నాగేశ్వరరావు, జామి నర్సింహమూర్తి, లాడి రమేష్, తాలాసు కృష్ణరావు, శాసనపూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ది లెజెండ్ రామ్మోహన్‌నాయుడు



- పండుగ వాతావరణంలో పుట్టినరోజు వేడుకలు
- నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రార్థనలు, పూజలు
- భారీగా రక్తదానం నిర్వహణ
- వస్త్ర, అన్నదాన కార్యక్రమాలు
- గ్రంథాలయంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటిన నేతలు
- అంగరంగ వైభవంగా కేంద్రమంత్రి పుట్టినరోజు వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తండ్రికి తగ్గ తనయుడిగా ఆయన ఆశయాలకు గొప్ప వారసుడిగా యావత్ భారతదేశ ప్రజలతో కీర్తింపబడుతున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఏడురోడ్ల కూడలిలో రామ్మోహన్‌నాయుడు 38వ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన పుష్కరకాలంలోనే కేంద్రమంత్రి స్థాయికి ఎదిగిన రామ్మోహన్‌నాయుడు క్రమశిక్షణ మనందరికీ ఆదర్శనీయమని అన్నారు. చిన్న వయసులోనే కేంద్ర విమానయానశాఖ మంత్రి పదవి, ఆసియా పసిఫిక్ దేశాల సమాఖ్య చైర్మన్‌గా ఎన్నిక, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలి వరుసలో కూర్చునే అవకాశం రామ్మోహన్‌కే దక్కుతుందన్నారు. కరోనా మహమ్మారి ప్రజల ప్రాణాలను హరిస్తున్న సమయంలో భవాని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంబులెన్స్‌లు, పేదలకు ఆహారం పంపిణీ, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో సిలిండర్లు ఏర్పాటు ప్రచారం కోరుకోని సేవాగుణం రామ్మోహన్‌నాయుడి సొంతమన్నారు. ఎంపీ ల్యాండ్ నిధులతో రామ్మోహన్ నాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలు, శాశ్వత భవన నిర్మాణాలు ఆయన ఖ్యాతిని, కీర్తిని మరింత ఇనుమడింప చేస్తోందని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. అనంతరం 200 మందికి వస్త్రాలు అందజేయగా, 2వేల మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో, కేంద్ర గ్రంథాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కలమట వెంకటరమణ, మెండ దాసునాయుడు, పిసిని చంద్రమోహన్, బిర్లంగి రామ్మోహన్, పీరుకట్ల విశ్వప్రసాద్, దానేటి శ్రీధర్, మాదారపు వెంకటేష్, బోయిన గోవిందరావు, రెడ్డి శివన్నారాయణ, రెడ్డి గిరిజా శంకర్, అరవల రవీంద్ర, చౌదరి బాబ్జి, అంధవరపు సంతోష్, తోణంగి వెంకన్నయాదవ్, అరవల పెదబాబు, అంబటి లక్ష్మీరాజ్యం, పీవీ రమణ, శీర రమణ, సింతు సుధాకర్, దుంగ శ్రీధర్, రమణమాదిగ, కొర్ను ప్రతాప్, కింజరాపు హరివరప్రసాద్, ప్రధాన విజయరామ్, ఉంగటి రమణ, దొండపాటి నవీన్, అల్లు తారక్ తదితరులు పాల్గొన్నారు.







## కేంద్రమంత్రి పేరిట మసీదులో ప్రార్థనలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దివంగత ఎర్రన్నాయుడు మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన దారిలోనే ఆయన తనయుడు రామ్మోహన్ నాయుడు కూడా నడవడం శుభ పరిణామమని వారీ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ ముబారక్, జిల్లా అధికార మైనార్టీలు ప్రతినిధి రోషన్ భాష, శ్రీకాకుళం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు ఇస్మాయిల్ అదినీ (షాను), ఉపాధ్యక్షులు సయ్యద్ షఫీ, సయ్యద్ అహ్మద్ తాజ్, మతాఫ్ ఖాన్, చోట, షబ్బీర్, హారం రషీద్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మసీదు ఫజర్ జమాత్, మేనేజ్మెంట్ కమిటీ పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్రమంత్రి పుట్టినరోజు వేడుకలు



(సత్యంన్యూస్, నరసన్నపేట)

తెలుగుదేశం ఆశాజ్యోతి రామ్మోహన్‌నాయుడు అని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం, కూటమి అభిమానులతో కలసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ అనుబంధ కార్యదర్శులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, నీటి సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాముకు శుభాకాంక్షలు తెలిపిన కలిశెట్టి

**న్యూఢిల్లీ :** తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదినం ఘనంగా జరుపుకున్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఇతర ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొని రామ్మోహన్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడి చిన్ననాటి ఫోటోను కలిశెట్టి అప్పల నాయుడు బహుకరించారు. ఈ ఫోటోలో ఎర్రన్నాయుడు రామ్మోహన్ నాయుడుకు చిన్నప్పుడు కేక్ తినిపిస్తున్న దృశ్యం ఉంది.



# 'ష'... ఆయన వాటా ఎంతని అడక్కండి!

(మొదటిపేజీ తరువాయి)

ఏఈ సంతోష్. అయితే ఇటువంటి లెక్కాపత్రం లేని పనుల్లో ఎక్కువ సొమ్ములు మిగులుతాయని ఏఈకి తెలుసు కాబట్టి ఎప్పట్లాగే తన బినామీ కాంట్రాక్టర్ అరసవల్లికి చెందిన మహేష్‌కు ఈ పనులు అప్పగించారు. రూ.10 లక్షలు పనులు ఒకేసారి చేపట్టాలంటే టెండర్లు పిలవాలి కాబట్టి, దీన్ని రెండు పనులుగా విభజించి చెరో రూ.5 లక్షలు పనులుగా చూపించి, రెండింటినీ నామినేషన్ పద్ధతిలో మహేష్‌కు అప్పగించేశారు. పోనీ ఈ బినామీ కాంట్రాక్టరైనా పార్కు పనులు సవ్యంగా చేశాడా? అంటే.. అదీ లేదు. పిల్లలు ఆడుకోడానికి మట్టి వేయాల్సిన చోట రోడ్డు పనులకు వినియోగించే గ్రావెల్‌ను వేసి పార్కును చదును చేసేశాడు. ఇక బ్యూటిఫికేషన్ పేరుతో పార్కులోకి వెళ్లే రహదారికి అరిగిపోయిన టైర్లను తెచ్చి, వాటికి అనాపరక రంగులు వేయించి బ్యూటిఫికేషన్ అని చూపించేశాడు. ఈ పనులు చూసిన ఇంజినీరింగ్ అధికారి ఎవరైనా బిల్లులు చెల్లించడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తారు. కానీ మహేష్‌కు సలహా ఇచ్చిందే ఏఈ సంతోష్ కాబట్టి, ఎంచక్కా దీని మెజర్మెంట్ పూర్తిచేసి బిల్లులు ఇచ్చేశారని తెలుస్తుంది. అయితే ఈ పార్కులో మట్టికి బదులు రాళ్లతో కూడిన గ్రావెల్ వేశారని బయటకు రావడంతో మేం తిన్నాం, నువ్వూ తినంటూ మరో రూ.8 లక్షలకు ఎస్టిమేషన్ పెంచి ఇప్పుడు దాని మీద మట్టి వేసే పనిని మరో కాంట్రాక్టర్ దీర్ఘాశి తిరుమలరావుకు అప్పగించారు. మహేష్ మొదట్నుంచీ.. అంటే ఏఈ సంతోష్ ఇక్కడకు బదిలీపై వచ్చిన దగ్గర్నుంచి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులకు ముద్దుబిడ్డగానే చెలామణీ అవుతున్నాడు. మహేష్, గణేష్, సంతోష్‌ల త్రయం మున్సిపాలిటీలో ఎక్కువ పనులు గత ఏడేళ్లలో చేపట్టినట్లు తెలుస్తుంది. కొత్తగా కార్గిల్‌పార్క్ పనులను కూడా మహేష్, గణేష్ కలిసి చేపట్టారు. మధ్యలో పాత హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కు మాదిరిగానే దీర్ఘాశి తిరుమలరావును కూడా చేర్చారు. రూ.40 లక్షలు నిధులు సుడా నుంచి రావడంతో తూతూ మంత్రంగా ఇక్కడ పనులు పూర్తిచేశారని కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు చెబుతున్నారు. వాస్తవానికి నామినేషన్ పద్ధతిలో పనులు ఇవ్వాలంటే అది అత్యవసరమై ఉండాలి. ఇక్కడ కేంద్రమంత్రి చెప్పారు కాబట్టి అత్యవసరంగానే దాన్ని చూపించి డొల్ల పనులు చేపడుతున్నారు. ఆ మాటకొస్తే అచ్చెన్నాయుడు మళ్లీ మంత్రి అయిన తర్వాత, ఇదే కేంద్రమంత్రి అనేక పనులు చేపట్టాలని సూచించారు. వాటిని పక్కన పెట్టి కేవలం మట్టి మశానంతో పూర్తిచేసి నాలుగు రోజులకు కొట్టుకుపోయే పనులను మాత్రమే కార్పొరేషన్‌లో చేస్తున్నారు. మున్సిపాలిటీకి స్పెషలాఫీసరు కలెక్టర్ కావడంతో కలెక్టర్ బంగ్లాలో గతంలో రూ.కోటికి పైగా పనులు మహేష్‌తోనే ఏఈ సంతోష్ చేయించారు. కలెక్టర్, జేసీ బంగ్లాల్లో రిపేరు వర్క్‌లను మున్సిపాలిటీ నుంచి చేయిస్తున్నారని సంబంధిత అధికారులకు తెలుసు గానీ, ఈ పేరుతో ఎంత సొమ్ము నొక్కేస్తున్నారన్న విషయం కలెక్టర్, జేసీలకు తెలియదు. మున్సిపల్ కార్యాలయంలో మాత్రం కలెక్టర్ ఆదేశాల మేరకే చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. పార్కుల్లో మొక్కలు పెరగాలన్నా, పిల్లలు ఆడుకోవాలన్నా మట్టి మాత్రమే ఉండాలి. గ్రావెల్ వేస్తే కచ్చితంగా బిల్లులు ఆపాలి. అరసవల్లికి చెందిన కాంట్రాక్టర్ మహేష్ ఏఈ సంతోష్ ఇచ్చిన పనిని అంతే సంతోషంగా వేరే వ్యక్తులకు అప్పగించి పైసా పెట్టుబడి లేకుండా సొమ్ములు చేసుకుంటున్నారు. 150 అడుగుల పొడవు, 100 మీటర్ల వెడల్పు ఉన్న ఒక పార్కులో కంకర, పాత టైర్లు వేయడానికి రూ.10 లక్షలు ఎందుకిచ్చారో, ఇప్పుడు మరో కాంట్రాక్టర్ ద్వారా రూ.8 లక్షల ఖర్చుకు ఎందుకు సిద్ధపడుతున్నారో కనీసం కమిషనర్‌కు తెలిసినా సంతోషం.

## క్రీడలు ఉన్నత వ్యక్తిత్వానికి దోహదపడతాయి

**- ఇంటర్ పాలిటెక్నిక్ ఆటలపోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శారీరక కార్యకలాపాల్లో నిమగ్నమవడం వల్ల విద్యార్థి దృష్టి, క్రమ శిక్షణ, ఏకాగ్రత మెరుగుపడుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాపోటీలను ప్రారంభించి, అంతరం మాట్లాడారు. విద్యార్థి శారీరక, మానసిక ఆరోగ్యం కూడా పెంపొందేందుకు దోహదపడుతుందని, సామాజిక బాధ్యతను కలిగిస్తుందని ఎన్ఈఆర్ పేర్కొన్నారు.





## వరం ఛారిటబుల్ ట్రస్ట్ అన్నదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా ఏడురోడ్ల జంక్షన్, డే అండ్ నైట్ జంక్షన్‌లో వరం ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 400 మందికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా బుధవారం అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్, బోయిన గోవిందరాజులు, శ్రీనివాస చక్రవర్తి, అంధవరపు రఘు, ఇప్పిలి తిరుమలరావు, కళ్యాణ్ చక్రవర్తి, కిల్లం శెట్టి శ్రీనివాస్, అంధవరపు రాఘవ, కరగాన భాస్కరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.